# జ్ఞానోదయం

— ఎం.వి.స్వామి

"నా ఖర్మ కొద్దీ, దిక్కుమాలిన అత్తవారు దొరికారు. ఒక అచ్చటా లేదు, ఒక ముచ్చటా లేదు. పెళ్ళినాడిచ్చిన ముష్టి పాతిక వేలు, కొద్ది కానుకలు తప్ప అల్లుడికి గొప్పగా మర్యాదలు చేస్తూ మంచి మంచి కానుకలు ఇద్దామనే ఆలోచనలే లేవు.కూతుర్ని సినిమాలకు, షికార్లకు తిప్పడానికి ఒక స్కూటరైనా కొందామనే వుద్దేశమే ఏడవడం లేదు నీ కన్న వారికి" అంటూ దెప్పి పొడిచాడు ఆనందరావు భార్య లలితను.



"మీరు ఎంత సేవూ నా కన్న వారినే ఆడి పోసుకుంటారు. పెళ్ళి నాడిచ్చిన కట్నం కానుకలు కాకుండా, తరువాత కూడా మనల్ని సంతృప్తి పరుస్తూ ఎప్పటి కప్పుడు కట్న కానుకలు ఇస్తూనే వున్నారు. వాళ్ళకు కలిగింది వాళ్ళు ఇస్తున్నారు. వాళ్ళయినా ఎక్కడ మంచి తేగలరు పాప్ము, మీ రాచ కోరికలు తీర్చడాని కి.? మీకూ పెళ్లీడు చెల్లి ఉందిగా... ఆమె పెళ్లి చేసినప్పుడు తెలుస్తుంది ఆడ పిల్ల వారి కష్టాలు" అని హెచ్చరిక చేస్తూ మూతి బిగించింది లలిత.

"సర్లే మేము మీ నాన్నలాంటి పిసిని గొట్టులం కాదు – ప్రతి దాన్ని మూడు ముడుపులు, ఆరులెక్కలు వేయడానికి – మా చెల్లి పెళ్ళి ఘనంగా చేస్తాం. మీరిచ్చే ముష్టి కట్న కానుకల కంటే ఎక్కువ గానే మా క్యాబోయే బావగారికి ఇస్తాం. కన్న వారింటి నుంచి పైసా తెచ్చుకోలేవు గానీ, పౌరుషానికి మాత్రం ఏ మాత్రం తక్కువ కావు" అంటూ ముఖం చిట్లించాడు ఆనందరావు.

"చెప్పడానికేమి, ఎన్నైనా చెప్పొచ్చు. ఆడ పిల్లను అత్త వారింటికి పంపి పెళ్ళి కొడుకు కోరికలు తీర్చలేక, అతని దెప్పి పొడుపులు వినలేక మదన పడినప్పుడు తెలుస్తుంది, ఆ బాధేమిటో. పెళ్ళయిన మొదట్లో మా నాన్న కూడా మా అమ్మను కన్నవారింటి నుంచి ఎప్పటి కప్పుడు డబ్బు తెమ్మని సతాయించే వాడట. మన పెళ్ళయిన తరువాత మీ కోరికలు తీర్చలేనప్పుడు మా నాన్నకు అర్థమయిందట, ఆడ పిల్లల తండ్రి బాధలు. అందుకు ఆయన ఇప్పటింతో పశ్చాత్తాపం పడు తుంటారు... ఇక మీకు కూడా తెలుస్తుందిలే ముందు ముందు..." అంటూ లలిత భర్తవైపు చూసింది.

"చూడు లలితా, పెళ్ళి కొడుకు కోరికలు తీర్చడం, ఇంటల్లుని డిమాండ్లు నెరవేర్చడం అత్తింటి వారి కర్తవ్యం తెలు సా!" అంటూ ఏదో నీతి వాక్యం చెప్పినట్టు ఫీలయిపోయాడు ఆనందరావు.

పేరుకే ఆనందరావు గాని, పెళ్ళయ్యింది మొదలు భార్యను నిత్యం అమ్మగారింటినుంచి ఏదో ఒక విలువైన కానుక లేదా డబ్బు తెమ్మని సతాయి స్తుంటాడు. పెళ్లై ఇద్దరు పిల్లలకు తండ్రైనా, కొత్త పెళ్ళి కొడుకులా ఫీలవుతూ అత్త వారిని వేధించే వాడు. ఆడ పిల్లల తల్లిదండ్రుల బాధలు అర్థం చేసుకునే వాడు కాదు.

అటువంటి ఆనందరావు చెల్లికి మంచి సంబంధమే వచ్చింది. పెళ్లి కొడుకు గవర్నమెంట్ ఉద్యోగి. అందుకే ఆనందరావు తన తండ్రి సంపాదించిన స్థిర, చరాస్తులను మొత్తం అమ్మేసి చెల్లి పెళ్ళి ఘనంగా చేశాడు. సుమారు లక్ష రూపాయలు కట్నం – మరో లక్షతో విలువైన కానుకలు ఇచ్చి, పెళ్ళి బాగా చేసి చెల్లెలును అత్త వారింటికి పంపాడు.

పెళ్ళయిన రెండు నెలలకే ఆనందరావు చెల్లెల్ని పుట్టింటికి బలవంతంగా పంపించారు అత్త వారు. "మీ అన్నయ్య ఇచ్చిన ముష్టి లక్ష రూపాయల కట్నం, పనికి మాలిన కానుకలు మాకు చాలవు, ఇంకా కలర్ టి.వి., ఫ్రిజ్, స్కూటర్, వాషింగ్ మిషన్ వంటి మరికొన్ని కానుకలు తేవాలి. లేదా, శాశ్వతంగా కన్న వారింటి దగ్గరే వుండి పోవా లంటూ" హుకుం జారీ చేశారు.

విషయం తెలుసుకొన్న ఆనందరావు గుండె చెరువైంది. భార్యతో చెప్పి బావురుమన్నాడు. "ఇది అన్యాయం, ఉన్నదం తా ఖర్చు చేసి పెళ్ళి చేశాను కదా! ఇంకా కానుకలు తెమ్మంటే నే వెందులో దూకాలి" అంటూ చెల్లెలి భర్త కాళ్లు పట్టుకున్నాడు. అయినా ఫలితం లేకపోయింది.

అప్పడర్థమైంది ఆనందరావుకు, ఆడ పిల్లల కన్న వారి బాధలు. అందుకే ఈ సారి పండక్కి తన అత్తమామలను తానే పిలిచి వారిని తల్లిదండ్రుల్లా గౌరవించాలనుకొన్నాడు. ఇక అత్త వారింటినుంచి కానుకలు కోరకూడదనుకొన్నాడు. పండుగకు రమ్మని మామగారికి లెటరు రాశాడు.

◆